క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు శిక్షణ

ఒంగోలు: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో ట్యాలీ కోర్సులో నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు కో ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, ఇంటర్ ఉత్తీర్ణత/ఫెయిల్, డిప్లమా పాస్/ఫెయిల్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని, బెంగళూరులో 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ 35 రోజుల్లో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో ఉచితంగా శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం 100 శాతం వివిధ సంస్థలలో కనీసం నెల జీతం రూ.15 వేలకుపైగా ఇచ్చేలా ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు హరిప్రసాద్, కో ఆర్డినేటర్, సెల్ నెంబర్ 9000487423ని సంప్రదించాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళన

ఒంగోలు: స్థానిక రావ్ అండ్ నాయుడు ఇంజినీరింగ్ కాలేజీలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సోమవారం ఫ్యాకల్టీ విషయంపై ఆందోళన చేపట్టారు. కాలేజీ డైరెక్టర్ భాస్కర్ పటేల్ అక్కడకు చేరుకుని విద్యార్థులతో చర్చించారు. ఫ్యాకల్టీ విషయంలో ఆందోళన అవసరం లేదని విద్యార్థులకు సూచించారు. ఇప్పటికే అధ్యాపకుల నియామకం జరిగిందని, వారంతా మార్చి 1వ తేదీలోపు విధుల్లో చేరాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. అందుకు వారు కూడా అంగీకరించారన్నారు. మార్చి 2 నుంచి అధ్యాపకులు 24 మంది జాయినవుతారన్నారు. భోజనం విషయంపై కూడా ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సమస్యలను తాము చాన్సిలర్ దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే అన్నీ పరిష్కరిస్తామని భాస్కర్ పటేల్ తెలిపారు.

కేంద్రాల నిర్వహణను వేగవంతం చేయాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

నాగులుప్పలపాడు: గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా చేయూతనందించే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని డ్వామా పీడీ శీనారెడ్డి సూచించారు. నాగులుప్పలపాడులో నిర్మాణంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును సోమవారం ఆయన పరిశీలించారు. కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పరిశీలనలో వైఎస్సార్ సీపీ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీవో రవి, ఈసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాపోరు యాత్ర నిర్వహణ



యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు నగరంలో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్, పార్లమెంటు కన్వీనర్ సిగ్గం శ్రీనివాసరావు, పి.కృష్ణారెడ్డి, దామోదర్, ధనిశెట్టి రాము, సంజీవ్‌కుమార్, లక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొని పలు ప్రజా సమస్యలను ప్రస్తావించారు.

తెలుగు భాష సేవకులకు సత్కారం



సన్మానం అందుకుంటున్న నేమ్మాని, మైనంపాటి

ఒంగోలు మెట్రో: లయన్స్ క్లబ్ ఒంగోలు సిటిజన్ ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు రోడ్డు బైపాస్‌లోని శ్రీ హర్షిణి డిగ్రీ కాలేజీలో సోమవారం తెలుగు భాష సేవకులను సత్కరించారు. విశిష్ట తెలుగు భాషా సేవకులు, గురు సహస్రావధాని డాక్టర్ కడిమెల్ల వరప్రసాద్ ఆధ్వర్యంలో ఒంగోలులోని ప్రముఖ సాహిత్యవేత్తలు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ధేనువకొండ సుబ్బయ్య, నేమ్మాని సీతారామమూర్తి, మైనంపాటి సాయిని సన్మానించారు. పలువురు సాహితీవేత్తలు పాల్గొని వారిని అభినందించారు.

సమన్వయంతో పనులు చేయాలి

- అధికారులతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీఓ సుగుణమ్మ

మద్దిపాడు: ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని అధికారులు పనులు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధుల మాట లెక్క చేయకుండా ఉన్నారని తెలిసిందన్నారు. అధికారులు తాము ప్రజలకు ఏం చేయగలరో వారికి తెలుసని, తెలిసీ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తాను ఆమోదించేది లేదని అన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో చేయాల్సిన పనులు చెప్పినప్పుడు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆషామాషీగా వ్యవహరిస్తే సహించనని చెప్పారు. ప్రజలకు నాయకులు సమాధానం చెప్పుకునే పరిస్థితి కల్పిస్తే అటువంటి వారికి తగిన రీతిలో చెప్పాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో అధికారులు తమ శాఖల ద్వారా చేయించాల్సి వస్తే తనకు నేరుగా చెప్పాలని, తాను ఉన్నత స్థాయి అధికారులతో మాట్లాడి ఆయా శాఖల ద్వారా పనులు వేగవంతం చేయించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు ఏదైనా ఇబ్బంది వస్తే వారు నేరుగా ప్రజాప్రతినిధులను నిలదీస్తారని, వారు అధికారులపై ఒత్తిడి తెస్తారని అన్నారు. ప్రజలకు మేలు చేయడానికే ఈ ప్రభుత్వం పనిచేస్తోందని, అందువలన ప్రతి అధికారి జాగ్రత్తగా మసలుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. అధికారులకు ఏదైనా ఇబ్బంది ఎదురైనా తనకు చెబితే పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని మంత్రి అన్నారు. ముందుగా మండలంలోని అన్ని శాఖల పురోగతిపై మంత్రి సమీక్షించారు. కొందరు అధికారులను గట్టిగా మందలించి ఎక్కడా అలసత్వం ఉండడానికి వీలులేదని, వారం రోజుల వ్యవధిలో ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టిన సమస్యలను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి ఎంపీడీఓ సుగుణమ్మ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పార్టీ సానుభూతిపరుల మృతికి మంత్రి సంతాపం



రామయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, నాయకులు

మద్దిపాడు: మండలంలోని నేలటూరు, మద్దిపాడు గ్రామాల్లో మృతిచెందిన పార్టీ సానుభూతిపరుల మృతదేహాలను సోమవారం మంత్రి మేరుగు నాగార్జున సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేలటూరు గ్రామంలో పార్టీ కార్యకర్త వేడల పరిశుద్ధం, మద్దిపాడులో మద్దిరాల రామయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వీరి మృతి పార్టీకి తీరని లోటని మంత్రి అన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, కార్యదర్శి, ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, సీనియర్ నాయకులు మోరబోయిన సంజీవరావు, దుంపా సుబ్బారెడ్డి, పాకనాటి మహానందరెడ్డి, వడేల గజేంద్రం, మజీద్, మద్దా లక్ష్మీనారాయణ, మద్దిపాడు సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శించిన మంత్రి మేరుగు



ఆంజనేయులును పరామర్శిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు టౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మేకం ఆంజనేయులును రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున సోమవారం పరామర్శించారు. చీమకుర్తి మండల నాయకులతో కలిసి ఆస్పత్రికి వచ్చి ఆంజనేయులు ఆరోగ్య పరిస్థితి గురించి అతని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ హనుమంతరావు, ఆయనకు చికిత్స చేస్తున్న న్యూరోసర్జన్ డాక్టర్ షేక్ వలిబాబు మంత్రికి చికిత్స వివరాలు తెలియజేశారు. ప్రస్తుతం ఆంజయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు. మంత్రి వెంట చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ గోగినేని వెంకటేశ్వర్లు, సేవాదళ్ అధ్యక్షుడు కొమ్మూరి సుధాకర్, నియోజకవర్గ ఎస్సీ నాయకుడు కందుల డేనియల్, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై బాలినేని ప్రణీత్‌రెడ్డి పర్యటన



ప్రణీత్‌రెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ప్రజా సమస్యలపై స్థానిక గాంధీరోడ్డులోని పూలకొట్ల బజారులో సోమవారం సాయంత్రం పర్యటించారు. వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంటా రామానాయుడు, డివిజన్ అధ్యక్షుడు జీఎస్ కృష్ణతో కలిసి పర్యటించి స్థానిక వ్యాపారులు, ప్రజలను కలుసుకుని సమస్యలడిగి తెలుసుకున్నారు. రోడ్డులో విద్యుత్ వైర్లతో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో స్పందించిన ప్రణీత్‌రెడ్డి.. సొంత నిధులతో విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా దేవతు వారి సందులో చెత్తకుండీ వల్ల ఇబ్బందిగా ఉందని స్థానికులు తెలియజేయడంతో దానిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలినేని ప్రణీత్‌రెడ్డిని స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో దేవతు శ్రీరాములు, దేవతు అశోక్, నేతికొట్టు రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు లేకుండా చూడండి



ఉపాధి పనులపై చర్చిస్తున్న పీడీ శీనారెడ్డి

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ శీనారెడ్డి

నాగులుప్పలపాడు: గ్రామాల్లో నిర్వహించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలని డ్వామా పీడీ శీనారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2022–23 ఏడాదిలో జరిగిన ఉపాధి పనులను 10 రోజులుగా అన్ని గ్రామాలలో తనిఖీ చేసినట్లు తెలిపారు. బృందం చేపట్టిన పనుల పరిశీలన, రికార్డులపై డీఆర్‌పీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఒక్కో గ్రామం చొప్పున క్షేత్ర స్థాయి పరిశీలన చేసి కొన్ని చోట్ల పనుల గుర్తింపులో లోపాలు, మస్టర్‌లో తప్పులు వంటివి గమనించి రికవరీలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీవోలు రవి, ధనుంజయ్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.47 లక్షలు



చైర్మన్, ఈవోలకు విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,47,705 ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.59,110 లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.25,070, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.60,525, ఇతర విరాళాలు రూ.3 వేలు ఆదాయం వచ్చినట్లు ఈఓ, చైర్మన్‌లు తెలిపారు. అన్నదానానికి విజయవాడకు చెందిన నాళి నందిని, తండ్రి బసవయ్యలు రు.17,100 అన్నదానానికి విరాళంగా అందజేశారన్నారు. కొమ్మినేని వెంకట్రావు, పాల్గొన్నారు.

గురుకులలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: అర్ధవీడు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లలో 70 ఎస్సీ, ఎస్టీ 5, బీసీ 4, ఇతరులకు 1, ఇంటర్మీడియేట్‌లో సీఈసీ 40 సీట్లు, ఎంఈసీలో 40 సీట్లలో, ఎస్సీ 75 శాతం, బీసీ 12, ఎస్టీ 6, బీసీ 5, ఇతరులు 2 శాతం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో ఈ నెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 3వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సంప్రదించాలని కోరారు.

ఉత్కంఠ భరితంగా ఖోఖో పోటీలు

- స్త్రీ, పురుష విభాగాల్లో విజేత ప్రకాశం



విజేతలకు బహుమతులు అందజేసిన చైర్‌పర్సన్ అరుణ, సుబ్బారావు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఖోఖో ఫైనల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. మహిళల విభాగంలో కృష్ణ జట్టుపై ప్రకాశం జట్టు విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. పురుషుల విభాగంలో ప్రకాశం–విజయనగరంపై ఫైనల్ పోటీలో విజయం సాధించింది. ఈ నెల 24న ప్రారంభం అయిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. విజేతలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు బహుమతులు అందజేశారు. పురుషుల విభాగం నుంచి 13, స్త్రీల విభాగం నుంచి 13 టీములు హాజరయ్యాయి. ఆయా టీముల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి టీముకు ఎంపిక చేశారు. మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఈ టీములు పాల్గొంటాయి. రాష్ట్ర స్థాయి మహిళా ఖోఖో టీముకు సామర్లకోట గ్రౌండ్‌లో శిక్షణ ఇస్తారు. పురుషుల టీముకు నెల్లూరులో శిక్షణ ఉంటుందని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు.

స్వాతి దంత వైద్యశాల ప్రారంభం

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలు రోడ్డులో పవర్ ఆఫీసు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన స్వాతి దంత వైద్యశాలను సోమవారం ప్రారంభించారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జీజీహెచ్ డెంటల్ హెచ్ఓడీ డాక్టర్ నామినేని కిరణ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దంత సమస్యలకు చక్కటి పరిష్కారం చూపే దిశగా ఒంగోలులో మరో దంత వైద్య శాలను ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో సేవలందించి అనతి కాలంలోనే మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అన్ని రకాల దంత సమస్యలకు ఆధునిక వైద్య పరికరాలతో వైద్యం చేయనున్నట్లు వైద్యశాల నిర్వాహకుడు, ఆర్థోడెంటిస్ట్ డాక్టర్ గురవయ్య దాసరి తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని పెద్ద పెద్ద నగరాలలో లభించే వైద్యాన్ని ఇక్కడి ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో ఒంగోలు నగరంలో దంత వైద్యశాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. వంకరపళ్లను సరి చేయడం, క్లిప్స్ అమర్చడంలో ప్రత్యేక శిక్షణ పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో డా.ఫర్హతుల్లా, పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలోని బస్టాండ్ రోడ్డులో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

కొత్తపట్నంలో శరవేగంగా విద్యుత్ పనులు

కొత్తపట్నం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి పల్లెపాలెం వరకు రూ.2.75 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా విద్యుత్ ఆధునికీకరణ పనులు కూడా చేపట్టారు. రోడ్డుకు రెండు వైపులా నూతన విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. సన్‌పోల్స్‌పైన 11కేవీ లైన్, దాని కింద ఎల్‌టీ లైన్ వస్తుందని విద్యుత్ ఏడీ మోహన్‌రావు తెలిపారు. విద్యుత్ ఆధునికీకరణ పనులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కృషితో రూ.23 కోట్ల నిధులు మంజూరవగా, ఇప్పటికే ఆలూరు, గాదెపాలెం, మోటుమాల, పాదర్తి, రంగాయపాలెం, కె.పల్లెపాలెం, అల్లూరు, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, మడనూరు, ఈతముక్కల, సంకువారిగుంట గ్రామాల్లో కొత్త పోల్స్, వైర్లు అమర్చారు. అందులో భాగంగా కొత్తపట్నంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు కూడా విద్యుత్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని ఏడీ తెలిపారు.

అందరికీ నాణ్యమైన వైద్యం



ఉలిచిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కరవది పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా సోమవారం ఉలిచి గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో డివిజన్లలో, జిల్లా కేంద్రాల్లో మాత్రమే ప్రభుత్వ వైద్యశాలలు ఉండేవని గుర్తుచేశారు. వైద్య రంగానికి పెద్దపీట వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సబ్‌సెంటర్లను పీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేసి సిబ్బందిని పెంచి ఆపరేషన్లు సైతం చేయిస్తోందని తెలిపారు. అందులో భాగంగా ప్రతి గ్రామానికి సీహెచ్‌వోల ఏర్పాటు, ఏఎన్ఎంల ఏర్పాటు, పూర్తి స్థాయిలో మందులు అందించడం జరిగిందన్నారు. ఫ్యామిలీ కాన్సెప్ట్ ద్వారా వారి వారి గ్రామాల్లోనే ప్రతి నెలా వైద్య సౌకర్యం పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో కృష్ణారెడ్డి, ఏఎన్ఎంలు రజని, జయకుమారి, సీహెచ్‌వో రవి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీపీ మల్లికార్జునరెడ్డి



పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

ఒంగోలు రూరల్: ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేసి గృహ వసతి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఒంగోలు ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మంగళాద్రిపురంలో 200 మంది అర్హులైన నిరుపేదలకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలు పంపిణీ చేశారు. యరజర్ల సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మశ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించడం జరిగిందని తెలిపారు. కేవలం నిరుపేదలకు గృహ వసతి కల్పించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. ఆ విషయాన్ని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాటించారని పేర్కొన్నారు. లబ్ధిదారులు వెంటనే గృహాలు నిర్మించుకునేందుకు సమాయత్తం కావాలని ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తమ్మిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో తమ గ్రామం ఎప్పుడూ ముందుంటుందన్నారు. అధికారుల సహాయ సహకారాల మేరకు పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు జాజుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పొదిలి: నిరుద్యోగ యువతీయువకులకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్య శిక్షణ తరగతులను సోమవారం ఈఓఆర్డీ కృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. సీస్‌బర్డ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎస్‌టెక్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకులు జి.సుమలత మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారు, చిన్న వ్యాపారులు కూడా అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.